క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిట్యాల : మండలంలోని అన్ని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ రవీంధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రామన్నపేట 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. కాగా గ్రామాలకు సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శివలీలకు గోల్డ్‌స్టార్ సేవా ప్రతిభ అవార్డు


శివలీల

కనగల్ : మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకురాలు కంబాల శివలీల తన ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలకు గాను గోల్డ్ స్టార్ సేవా ప్రతిభ అవార్డు లభించింది. హైదరాబాద్ మెగా హెల్పింగ్ ఫౌండేషన్ డాక్టర్ శిరీష చేతుల మీదుగా ఈ నెల 31 హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో అవార్డు అందుకోనున్నట్లు ఆమె మంగళవారం తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నకిరేకల్ : పట్టణంలోని 8వవార్డులో ఎమ్మెల్యే వీరేశం ఎస్‌డీఎఫ్ నుంచి మంజూరు చేసిన రూ.5లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను మంగళవారం కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, వార్డు కౌన్సిలర్ పన్నాల పావని శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మంగినపల్లి రాజు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం


ఆస్పత్రి ఆవరణలో అన్నదానం చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో రోగుల సహాయకులకు మంగళవారం వాసవీ క్లబ్ సభ్యుడు గుండా భవాని రమేష్ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అన్ని దానాలకంటే అన్నదానం గొప్పదని, దానిని దృష్టిలో ఉంచుకుని మూడు సంవత్సరాలుగా ఆస్పత్రిలో ఆన్నదానం చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వాసవీ, కపుల్స్, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో


అన్నప్రసాదం వితరణ చేస్తున్న ప్రతినిధులు

నకిరేకల్ : అమావాస్య సందర్భంగా పట్టణంలోని వాసవీ క్లబ్, కపుల్స్, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం 200మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వనితా క్లబ్ చార్టెట్ ప్రెసిండెంట్ బ్రహ్మదేవర పద్మావతి, క్లబ్ ఐపీసీ దేవరశెట్టి సత్యనారాయణ, ఆయా క్లబ్‌ల అధ్యక్షులు గుడిపాటి రవి, తేలకుంట్ల రాజుశోభారాణి, కందగట్ల శ్వేత, కందగట్ల బాలాజీ, కొండ్లె శైలజ, శ్రీకాకోళ్ల వెంకన్న, రేపాల పరిమిళ, బ్రహ్మదేవర వేణు, పబ్బతి స్వాతి, వీరవెల్లి రఘునాథ్, సంతోష్, మనోజ తదితరులు పాల్గొన్నారు.

రేపు దేవాలయ భూముల కౌలుకు వేలం

కనగల్ : మండల పరిధిలోని ఎం గౌరారం గ్రామశివారులో గల మారెపల్లి గ్రామ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వ్యవసాయ భూములకు ఈ నెల 29న కనగల్ రైతు వేదిక వద్ద కౌలు కోసం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి అంబటి నాగిరెడ్డి మంగళవారం తెలిపారు. మొత్తం 189ఎకరాల వ్యవసాయ భూములకు(70ప్లాట్లు) కౌలు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే రైతులు ముందుగా రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేషన్‌కార్డు మంజూరు పత్రాలు అందజేత

కనగల్ : మండల పరిధిలోని రాంచంద్రపురంలో మంగళవారం రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ యువజన నాయకుడు ఏమిరెడ్డి దిలీప్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులను ఇవ్వడం విస్మరించదని, రేవంత్ సర్కార్ రాగానే పేదలకు రేషన్‌కార్డులను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కొప్పుల యాదగిరిరెడ్డి, కదిరే రవి, శ్రీశైలం, నాగేష్ తదితరులున్నారు.

శిథిలావస్థలో వాటర్‌ట్యాంక్‌లు

- భయాందోళనలో స్థానికులు
- ప్రమాదకరంగా ఉన్న ట్యాంకులను కూల్చివేయాలని వేడుకోలు

చిట్యాల : మండలంలోని పలు గ్రామాల్లో మంచినీటి సరఫరాకు చేసేందుకుగాను గతంలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకులు వినియోగంలో లేకుండా పోతుండడంతో నిరుపయోగంగా మారగా, మరికొన్ని శిథిలావస్థకు చేరి కూలిపోయే ప్రమాదకర స్థితికి చేరుకుంటున్నాయి. మండలంలోని వట్టిమర్తి గ్రామంలోని ఒకటి, రెండో వార్డుల్లోని మంచినీటి ట్యాంకులు కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉంటున్నాయి. ఈ వాటర్ ట్యాంకులకు పైపులైన్ ద్వారా నీటి సరఫరా కనెక్షన్ ఇవ్వకపోవడంతో వృథాగా మారాయి. సుంకెనపల్లిలోని పదోవార్డులో ప్రభుత్వ స్కూల్ ఆవరణలో, ఒకటో వార్డులో వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. నేరడ గ్రామంలోకి వెళ్లే ప్రారంభంలో ఉన్న ట్యాంకు సైతం నిరుపయోగంగా ఉన్నాయి. వాటికి నీటి సరఫరా లేకపోవడంతో ఖాళీగా ఉంటున్నాయి. ఈ ట్యాంకులను నింపితే విద్యుత్ సరఫరా లేనప్పుడు గ్రామస్తులు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. కాని సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన ట్యాంకులు నిరుపయోగంగా మారాయి.

కూలిపోయే స్థితిలో ట్యాంకు..

ఎలికట్టెలో మంచినీటి అవసరాల కోసం గత కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకు శిథిలావస్థ చేరి కూలిపోయే స్థితిలో ఉంది. గతంలో


ఎలికట్టెలో శిథిలావస్థలో ఉన్న ట్యాంకు

గ్రామంలోని నీటి అవసరాలకుగాను ఈ ట్యాంకును నిర్మించారు. అనంతర కాలంలో ఈ ట్యాంకు శిథిలావస్థకు చేరుకొని పెచ్చులు ఊడిపోయి కూలిపోయే స్థితికి చేరుకుంది. ఈ ట్యాంకు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే దారిలోనే ఉండటంతో కూలిపోతే ఆ దారి వెంట వెళ్లేవారికి ప్రమాదం



వట్టిమర్తిలో

జరిగే అవకాశం ఉంది. వెంటనే ట్యాంకును తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

శిథిలమైన ట్యాంకులను తొలగించాలి



మా గ్రామంలో గతంలో తాగునీటి అవసరాల కోసం ట్యాంకును నిర్మించారు. ఈ ట్యాంకు చాలా ఏళ్ల పాటు వినియోగంలోనే ఉంది. అనంతరం శిథిలావస్థకు చేరుకోవడంతో మరోచోట నీటి ట్యాంకును నిర్మించారు. దీంతో ఈ ట్యాంకు వినియోగంలో లేక శిథిలావస్థలకు చేరి కూలిపోయే పరిస్థితి ఉంది. ఈ ట్యాంక్ కూలిపోయి ప్రమాదం సంభవించకముందే తొలగించాలని గతంలో గ్రామసభలో తీర్మానం చేసి అధికారులకు తెలిపారు. వెంటనే శిథిలావస్థలకు చేరిన ట్యాంక్‌ను తొలగించాలి.

– గొలనుగొండ దశరథ, మాజీ ఎంపీటీసీ, ఎలికట్టె

ఏడాదిలోపే లిఫ్ట్ పనులు పూర్తి

- ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ఈ ఏడాది డిసెంబర్‌లోగా రూ.101కోట్లతో చేపట్టిన అయిటిపాముల లిఫ్ట్ నిర్మాణం పనులు పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో లిఫ్ట్ ఆయకట్టు రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లిఫ్ట్ మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. లిఫ్ట్ నిర్మాణం, రిజర్వాయర్, కాల్వలకు సంబంధించి భూసేకరణ విషయంలో రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఐబీ


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

ఏఈ ఖలీల్‌అహ్మద్, కట్టంగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, నాయకులు నంద్యాల వెంకట్‌రెడ్డి, చెర్వుఅన్నారం రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

గట్టుప్పల్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన, సైన్స్‌ల్యాబ్, విద్యార్థులకు ఉచితంగా ఆరోగ్య పరిక్షలు, విశాలమైన తరగతి గదులు ఉన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అంతంపేట గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

విత్తన దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు


నల్లగొండ అగ్రికల్చర్ : విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ కమిటీ అధికారులు

నల్లగొండ అగ్రికల్చర్ : నకిలీ విత్తనాల విక్రయాలు అరికట్టడంలో భాగంగా వ్యవసాయ, పోలీస్, రెవెన్యూ శాఖ అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ కమిటీ అధికారులు మంగళవారం పట్టణంలోని పలు విత్తన దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని పత్తి విత్తనాల నిల్వలను పరిశీలించారు. ఆయా కంపెనీలకు చెందిన పత్తి విత్తన ప్యాకెట్లను, రికార్డులను పరిశీలించారు. అనంతరం నల్లగొండ మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, సీఐ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. నకిలీ పత్తి, వరి విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులను నమోదు చేయడంతో పాటు లైసెన్స్‌ను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా రశీదులు అందజేయాలని, అందులో పూర్తి వివరాలను నమోదు చేయాలని డీలర్లకు సూచించారు. ఈ దాడులలో టూటౌన్, రూరల్ ఎస్‌ఐలు సైదులు, సైదాబాలు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో పోలీసుల తనిఖీ

కనగల్ : మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను మంగళవారం చండూరు సీఐ ఆదిరెడ్డి, కనగల్ ఎస్‌ఐ విష్ణుమూర్తి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో సరైన లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, వివరాలు, ఎంఆర్‌పీకి అనుగుణంగా అమ్ముతున్న విక్రయాలు, ఉత్పత్తుల నాణ్యత, నిల్వ స్థితులు, ఇతర అవసరమైన రికార్డులను వారు పరిశీలించారు. దుకాణాల్లో నకిలీ విత్తనాల విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని దుకాణాదారులకు హెచ్చరించారు.

కట్టంగూర్ : ఎరువులు, విత్తనాల దుకాణాదారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి గిరిప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ఎరువులు, విత్తన దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేస్తారని తెలిపారు. రైతులు గుర్తింపు పొందిన దుకాణాల ద్వారా విత్తనాలు తీసుకొని బిల్లు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్‌ఐ ఎం.రవీందర్ ఉన్నారు.


కనగల్ : విత్తనాలను పరిశీలిస్తున్న సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ విష్ణుమూర్తి


కట్టంగూర్ : ఎరువుల దుకాణంలో విత్తన ప్యాకెట్లను తనిఖీ చేస్తున్న ఏఓ గిరిప్రసాద్

రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

చిట్యాల : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని చిట్యాల ఏఓ పగిడిమర్రి గిరిబాబు సూచించారు. మంగళవారం మండలంలోని శివనేనిగూడెం, సుంకేనపల్లి, ఆరేగూడెం, ఉరుమడ్ల, చిన్నకాపర్తి గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఏఓ పాల్గొని మాట్లాడారు. అతి తక్కువ నీటి వనరులతో తృణధాన్యాలను పండించి అధిక దిగుబడులతో పాటు అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ప్రత్యామ్నాయ పంటలను పండించేందుకుగాను అవసరమైన విత్తనాలను సబ్సిడీపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైతులంతా రైతు గుర్తింపు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే పెట్టుబడుల సాయం అందుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ వీణకుమారి, కృష్ణకుమారి, వాసుదేవ్, మనీషా, శంశాక, రైతులు పాల్గొన్నారు.

వరిసాగులో సన్నాలను ఎంపిక చేసుకోవాలి

కనగల్ : రైతులు వానాకాలం సీజన్‌లో వరిలో సన్న రకాలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి బెజవాడ అమరేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పర్వతగిరి గ్రామంలో రైతులకు క్రాప్ డైవర్సీటిపై అవగాహన కల్పించారు. సన్నరకాలకు ప్రభుత్వం క్వింటాకు రూ.500బోనస్ అందిస్తుందన్నారు. అదే విధంగా వీలైన చోట కందుల పంటను సాగు చేయాలని రైతులకు సూచించారు. కందుల పంట సాగుతో భూసారం పెరుగుతుందని, తద్వారా తదుపరి వేసిన పంటల దిగుబడి పెంచవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నవీన్ రైతులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి

కేతేపల్లి : పంట మార్పిడి చేసే అధిక దిగుబడి పొందవచ్చని మండల ఏఓ బి.పురుషోత్తం తెలిపారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి, ఇనుపాముల కొప్పోలు, గ్రామాలలో వానాకాలం పంటల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సాగు చేసిన వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా నేల అనుకూలతను బట్టి ఆయిల్‌ఫామ్, కూరగాయలు, పప్పుధాన్యాలు సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలన్నారు. అనంతరం పంటల సాగుపై సూచనలతో ముద్రించిన కరపత్రాలను రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది అవిష్కరించారు. సమావేశంలో ఏఈఓలు బాలరాజు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను సాగు చేయాలని ఏడీఏ, మండల ప్రత్యేకాధికారి బి.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు కంది, పెసర, మినుము, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయడంతో నేలలో భూసారం పెంచుకోవచ్చన్నారు. పంట మార్పిడి విధానం వల్ల భూమిలో పోషక విలువలు పెంపొందించవచ్చన్నారు. అదే విధంగా రైతులు విత్తనాలు ఎంపిక చేసేటప్పుడు అధిక దిగుబడి రకాలు ఎంచకోవడంతో మంచి దిగుబడి సాధించి మంచి లాభాలు పొందవచ్చన్నారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రి చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎం.సహాస్, ఏఈఓలు పి.విజయ్‌కుమార్, జి.సుజాత, శ్రీలత, నాగస్వామి, అరుణ, రైతులు పాల్గొన్నారు.


మర్రిగూడ : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వేణుగోపాల్


చిట్యాల : సుంకేనపల్లిలో మాట్లాడుతున్న ఏఓ గిరిబాబు


కనగల్ : రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ అమరేందర్‌గౌడ్


కేతేపల్లి : పంటల సాగు ప్రచార కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు, రైతులు

కార్యదర్శులపై వేధింపులు మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మునుగోడు : గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులపై మండల అధికారుల వేధింపులు మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్గూరి నర్సింహ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్జ రామచంద్రం డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొందరు కార్యదర్శులపై కక్ష కట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. అసలే ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కార్యదర్శులు నానా ఇబ్బందులు పడుతుంటే అధికారుల వత్తిడి చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా కార్యదర్శులపై పక్షపాత వైఖరి మానుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చాపల శ్రీను, మాజీ జెడ్పీటీసీ గోసుకొండ లింగయ్య, ఉప్పునూతల రమేష్, దుబ్బ వెంకన్న, వనం వెంకన్న, కురుమర్తి ముత్తయ్య, ఎండీ జానీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడ ఎఫ్‌ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు మంగళవారంతో ముగిసినట్లు శివన్నగూడ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ బాలం నర్సింహ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సీజన్‌లో 220మంది రైతుల నుంచి 10,677 క్వింటాళ్ల ధాన్యం సేకరించి 37లారీల ద్వారా మిల్లులకు తరలించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సంఘం సీఈఓ బండి మధుకర్‌గౌడ్, సిబ్బంది వెంకటేష్, కిరణ్, రైతులు తదితరులు ఉన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే నోటీసులు

దేవరకొండ : రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేసినట్లు దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి కుట్రపూరితంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుటిల రాజకీయాలు చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు వరుస నోటీసులు జారీ చేయడం వెనుక రాజకీయ దురుద్దేశం ఉన్నట్లు తేటతెల్లమైందన్నారు. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టిన తట్టుకొని నిలబడ్డ చరిత్ర కేసీఆర్ సైనికులదని ఆయన గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీని చూస్తుంటే సర్కార్‌లో రోజురోజుకు భయం పెరిగి పోతుందని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఇప్పటికైన కుటిల రాజకీయాలకు స్వస్తి పలకాలన్నారు.

క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం


క్రికెట్ క్రీడలో పాల్గొన్న క్రీడాకారులు

నల్లగొండ టూటౌన్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, నల్లగొండ క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ లీగ్ పోటీలు మంగళవారం పట్టణంలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నల్లగొండ గ్రీన్ టీం 167 పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ శివతేజ

కేతేపల్లి : రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్‌ఐ శివతేజ కోరారు. నల్లగొండ పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఇనుపాముల గ్రామంలో నిర్వహించిన రోడ్డు భద్రతా నియమాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహనం లేకపోవడంతోనే ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు, ధరించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. రోడ్డు నిబంధనలు పాటించకుండా రహదారులపై వెళ్తున్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జాల వెంకట్‌రెడ్డి, శివాలయ కమిటీ చైర్మన్ తిరుగుడు జితేందర్, జమీందర్ వెంకటేశ్వర్లు, వీపీఓ సతీష్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

కనగల్ : మండల కేంద్రంలో పీఏసీఎస్ భవన నిర్మాణానికి మంగళవారం నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి కనగల్ ఎస్‌ఎల్‌బీసీ క్వార్టర్స్‌లో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కనగల్ ఎస్‌ఎల్‌బీసీ క్వార్టర్స్‌లో స్థానిక అధికారులతో కలిసి పీఏసీఎస్ కార్యాలయంతో పాటు గోదాం నిర్మాణానికి 16గుంటల స్థలాన్ని గుర్తించినట్లు, ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ బి.పద్మ, ఏఆర్‌ఐ యాదగిరి, సీఓ రామచంద్రారెడ్డి, ఏపీఎం సంకు హరి, మాజీ సర్పంచ్ గోలి నర్సిరెడ్డి, కట్టెబోయిన పవన్‌యాదవ్, సిబ్బంది శంకర్, గిరి తదితరులు ఉన్నారు.


స్థలం పరిశీలిస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

మర్రిగూడ : సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ సర్పంచ్‌ల సంఘం పిలుపుమేరకు ప్రజావాణిలో వినతిపత్రం అందజేసేందుకు వెళ్తున్న మర్రిగూడ, కొండూరు మాజీ సర్పంచ్‌లు నల్ల యాదయ్య, కుంభం నర్సమ్మమాధవరెడ్డిని మండల పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు తీసుకొచ్చి మరీ పనులు చేపట్టామని, పెండింగ్ బిల్లులు రాక తాము ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని, బిల్లులు చెల్లిస్తామని చెప్పినా నేటికీ ఒక్క రూపాయి చెల్లించలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మాజీ సర్పంచ్‌లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరారు.

అండర్‌పాస్‌లు ఏర్పాటు చేయాలి

చిట్యాల : పట్టణంలోని జాతీయ రహదారిపై ప్రజల రవాణా సౌకర్యానికి గాను మూడు చోట్లు అండర్‌పాసింగ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి నేషనల్ హైవే ఆథారిటి అధికారులకు సిఫార్సు లేఖలు అందజేసినట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, చిట్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జడల చినమల్లయ్యలు మంగళవారం తెలిపారు. జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ ఎదురుగా నిర్మిస్తున్న అండర్ పాసింగ్‌తో పాటు బస్‌స్టేషన్ ఎదురుగా, వనిపాకల రోడ్డు వద్ద అండర్‌పాసింగ్‌లు నిర్మించాలని వారు హైవే అధికారులను కోరినట్లు వారు పేర్కొన్నారు.

నెహ్రూ సేవలు మరువలేనివి


నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మునుగోడు : దేశ అభివృద్ధి కోసం జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు అన్నారు. మంగళవారం నెహ్రూ వర్ధంతి సందర్భంగా పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, మాజీ ఎంపీటీసీ పందుల భాస్కర్, ఎండీ అన్వర్, కుంభం చెన్నారెడ్డి, జిట్టగొని యాదయ్య, స్వామి, సైదులు, పాలకూరి యాదయ్య, మల్లేష్, నాగరాజు, నర్సింహ, స్వామి, మహేష్, వెంకన్న పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలు

నకిరేకల్ : పట్టణంలోని మినీ స్టేడియంలో ఎమ్మెల్యే వేముల వీరేశం పుట్టినరోజు సందర్భంగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలను మూడో రోజు స్థానిక సీఐ రాజశేఖర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కొద్దిసేపు కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో నిర్వాహకులు నకిరేకంటి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికాయల ధరలు తగ్గించాలి

నల్లగొండ టూటౌన్ : నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టులో కొబ్బరికాయ ధర రూ.50లకు విక్రయిస్తున్నారని, బయట రూ.25లు ఉంటే అధిక ధరకు అమ్ముతూ భక్తులను దోపిడీ చేస్తున్నారని, వెంటనే సంబంధిత వ్యాపారిపై చర్యలు తీసుకొని ధర తగ్గించాలని తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్ మంగళవారం డిమాండ్ చేశారు. ఈ దందాపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.